# DD9 వార్త

తెలుగు దినపత్రిక

సోమవారం, సెప్టెంబర్ 29, 2025


## గోదావరి ఉధృతి





- భద్రాచలం వద్ద "దోబూచులాట"
- హెచ్చుతగ్గులతో కొనసాగుతున్న ప్రవాహం
- అమలులో మొదటి ప్రమాద హెచ్చరిక

3లో

భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం ఆదివారం పగలు, రాత్రి వేళల్లో స్వల్పంగా హెచ్చుతగ్గులు నమోదు చేస్తూ స్థానికులను, అధికారులను అప్రమత్తం చేస్తోంది. నీటిమట్టం ఒకసారి తగ్గుతున్నా, వెంటనే పెరుగుతూ 'దోబూచులాట' (దాగుడుమూతలు) ఆడుతోంది. ఆదివారం ఉదయం 6 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 42.10 అడుగులుగా నమోదైంది. - భద్రాచలం, (డిడి9 వార్త)




# ధర్మ యుద్ధం

## గర్జించిన గిరిజనం





- ఆదివాసీల ఐక్యతా రాగం
- జనసంద్రంగా మారిన భద్రాచలం
- లంబాడీలను ఎస్టీ జాబితాను తొలగించా లని డిమాండ్
- భద్రాద్రిలో భారీ ప్రదర్శన కవాతు
- 60 వేల మందితో బహిరంగ సభ

భద్రాచలంలో ఆదివాసీలు కదం తొక్కారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని ప్రధానమైన డిమాండ్ తో భద్రాద్రి కేంద్రంగా చేపట్టిన కార్యక్రమంతో దక్షిణ అయోధ్య దద్దరిల్లిపోయింది. వేలాది మంది గిరిజనులు భద్రాచలం చేరుకోవడంతో పట్టణమంతా జనసంద్రంగా మారింది.. వివిధ ప్రాంతాల నుండి భారీగా తరలివచ్చిన అడవి బిడ్డలు ఆదివాసీ ఐక్యతా రాగానే చాటారు. దాదాపు 60 వేల మందితో సుమారు మూడు కిలోమీటర్ల మేర భారీ ర్యాలీ, కవాతు నిర్వహించి తమ ధర్మయుద్ధాన్ని ప్రకటించారు. ఈ ధర్మయుద్ధం సభ ఆదివాసుల ఐక్యతను చాటడంతో పాటు ఆదివాసులలో పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరిలో నింపింది. ఈ సందర్భంగా భద్రాచలం జూనియర్ కళాశాల క్రీడామైదానంలో జరిగిన ఈ బహిరంగ సభలో ఆదివాసీ జేఏసీ నాయకులు పాలక ప్రభుత్వాలపై గట్టిగా గర్జించారు.

- భద్రాచలం, (డిడి9 వార్త)

2లో



5లో

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాబోయే వేళ

### 15 ఏళ్లుగా ప్రయత్నానికి తొలి అడుగు

- ఎన్నో ఒడిదుడుకుల మధ్య డిగ్రీ కళాశాల మంజూరు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో సాధ్యమైంది
- విద్యాధికారుల ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ఉన్నత విద్యనభ్యసించే దిశగా చర్యలు

## గ్రూప్ 1 లో మెరిసిన ఆణిముత్యం

- దైనంపల్లి ప్రవీణ్ ను సన్మానించిన ప్రజలు
- మానస పల్లి దళిత బహుజన బిడ్డ ప్రవీణ్ మల్టీ జోన్ 01 డీఎస్పీ ఎంపిక
- గ్రామీణ ప్రాంతాల్లో యువత ప్రవీణ్ ను ఆదర్శంగా తీసుకోవాలి

7లో

## 'గిరిజన దర్బార్'కి ఐటీడీఏ అధికారులుహాజరు కావాలి

- గిరిజనుల సమస్యలపై ఫిర్యాదులు అందించాలి
- ప్రాజెక్టు అధికారి (పీఓ) బి. రాహుల్

7లో



## యువతకు ఉన్నత విద్యా అవకాశాలు అందుతాయి

- విద్యా రంగంలో కొత్త అధ్యాయం సమ్మక్క సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ.
- సమ్మక్క సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ విశ్వవిద్యాలయం గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క

4లో








# ధర్మ యుద్ధం

## గర్జించిన గిరిజనం

- ఆదివాసీల ఐక్యతా రాగం
- జనసంద్రంగా మారిన భద్రాచలం
- లంబాడీలను ఎస్టీ జాబితాను తొలగించా లని డిమాండ్
- భద్రాద్రిలో భారీ ప్రదర్శన కవాతు
- 60 వేల మందితో బహిరంగ సభ

**భద్రాచలం, సెప్టెంబరు 28 ( డిడి9 వార్త)** తమ అడవి బిడ్డల హక్కులను కాపాడుకోవాలని, ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తక్షణమే తొలగించి అసలైన ఆదివాసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాచలం పట్టణం ఆదివారం గిరిజన జనసంద్రంగా మారింది. 'ఆదివాసీ ధర్మ యుద్ధం' బహిరంగ సభకు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది గిరిజనులు తరలివచ్చి, తమ ఐక్యతను చాటారు. దాదాపు 60 వేల మందితో సుమారు మూడు కిలోమీటర్ల మేర భారీ ర్యాలీ, కవాతు నిర్వహించి, తమ ధర్మయుద్ధాన్ని ప్రకటించారు. ఈ ధర్మయుద్ధం సభ ఆదివాసుల ఐక్యతను చాటడంతో పాటు ఆదివాసులలో పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరిలో నింపింది. భద్రాచలం జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన ఈ బహిరంగ సభలో ఆదివాసీ జేఏసీ నాయకులు పాలక ప్రభుత్వాలపై గట్టిగా గర్జించారు. ఆదివాసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు చుంచు రామకృష్ణ, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్, జేఏసీ రాష్ట్ర నాయకులు మోడెం శ్రీనివాసరావు, మాజీ ఎంపీ సోయం బాబురావు, రేగా కాంతారావు, పొదెం వీరయ్యలు మాట్లాడుతూ.. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

### – ఆదివాసీలకు అన్యాయం జరుగుతోంది –
### లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని

1976 రాజ్యాంగ సవరణ ద్వారా లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల అసలైన ఆదివాసీ తెగలైన గోండు, కోయ, కోలాం వంటి వారికి తీవ్ర అన్యాయం జరుగుతోందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడీలు రిజర్వేషన్లు అనుభవిస్తుండటం వల్ల ఆదివాసీలకు దక్కాల్సిన విద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్ల ఫలాలు వారికి దక్కడం లేదని స్పష్టం చేశారు. దీంతో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన ఆదివాసీలు మరింతగా వెనుకబడిపోతున్నారని పేర్కొన్నారు. అడవి ప్రాంతాల్లో దశాబ్దాలుగా జీవిస్తున్న తమ హక్కులు కాలరాయబడుతున్నాయని, తమకు రావాల్సిన రిజర్వేషన్ల వాటా దక్కడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల హక్కులకు నష్టం కలిగిస్తున్న లంబాడీలను తరిమికొట్టాలని వారు పిలుపునిచ్చారు.

### – ఉద్యమాలు కొనసాగుతాయి

దేశంలోని పలు రాష్ట్రాల్లో బీసీలుగా ఉన్న లంబాడీలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మాత్రం ఎస్టీలుగా గుర్తించడం చట్టబద్ధత లేని చర్య అని నాయకులు అభివర్ణించారు. దీనిపై పాలక ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని కోరారు. భద్రాచలంలో ప్రారంభమైన ఈ ఉద్యమం భద్రాద్రి నుంచి ఆదిలాబాద్ వరకు కొనసాగుతుందని ఆదివాసీ జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. దీపావళి తర్వాత ఆదిలాబాద్‌లో ఐదు రాష్ట్రాల ఆదివాసీలతో మరో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. తక్షణమే ఎస్టీ జాబితాపై సమీక్ష చేపట్టాలని, లేనిపక్షంలో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు బూర్గంపాడు మండలం సారపాక నుంచి భద్రాచలం సభ వేదిక వరకు వేల సంఖ్యలో ఆదివాసీలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు తాటి వెంకటేశ్వర్లు, మానె రామకృష్ణ, తెల్లం సీతమ్మ, పూనెం కృష్ణ, పాయం రవివర్మ, ముర్ల రమేష్, బట్టా హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.







# ఆదివాసీల 'ధర్మ యుద్ధం' సభకు పొదెం వీరయ్య భరోసా

- సమస్య పరిష్కారం కోసం సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువెళ్తా

**భద్రాచలం, సెప్టెంబర్ 28 (డీడీ 9 వార్త):** భద్రాచలంలో ఈరోజు నిర్వహించిన "ధర్మ యుద్ధం" ఆదివాసీ భారీ బహిరంగ సభకు తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ పొదెం వీరయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేలాది మంది ఆదివాసీలు జెండాలు, నినాదాలతో ఆయనకు వేదికపై ఉత్సాహంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ పొదెం వీరయ్య గారు మాట్లాడుతూ, ఆదివాసీ-లంబాడా తెగల మధ్య వివాదం చాలా సున్నితమైన, చారిత్రకమైన సమస్య అని పేర్కొన్నారు. ఈ సమస్యను విస్మరించకుండా, న్యాయబద్ధంగా పరిష్కరించే దిశగా కృషి చేయడం తమ బాధ్యత అని ఆయన గట్టిగా చెప్పారు. "ఈ సమస్యను నేను స్వయంగా తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి దృష్టికి మరియు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు గారి దృష్టికి తీసుకువెళ్తాను. త్వరలో వారితో పలుమార్లు సమావేశమై, పూర్తి వివరాలు చెప్పి, ఆదివాసీల న్యాయమైన డిమాండ్లకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకునేలా కృషి చేస్తాను" అని ఆయన భరోసా ఇచ్చారు. అలాగే, ఆదివాసీల పోరాట చరిత్రను గుర్తు చేస్తూ, "తుడుందెబ్బ" అనే ఆదివాసీ సంఘాన్ని స్థాపించి, నామకరణం చేసింది తమ బృందమేనని, అది కేవలం ఒక ఆర్గనైజేషన్ కాదని, మనుగడకు ప్రతీక అని ఆయన ఉద్ఘాటించారు. తన రాజకీయ జీవితమంతా ఆదివాసీల పక్షానే పోరాడిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఫలితాలు వచ్చేవరకు, హక్కులు సాధించేవరకు తన పోరాటం ఆగదు అని ఆయన దృఢంగా తెలిపారు. ఈ సభలో అనేక మంది ఆదివాసీ పెద్దలు, నాయకులు, యువజనులు పాల్గొని సంఘీభావం వ్యక్తం చేశారు.



### ఆటో యూనియన్ కు మద్దతుగా

# మారబోయిన రవి యాదవ్

శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 28,(డిడి9 వార్త) : శేరిలింగంపల్లి ఎచ్‌సీయూ డిపో ఎదురుగా ఉన్న ఆటో యూనియన్ కార్మికులు బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతు ఇస్తూ, మారబోయిన రవి యాదవ్ ఆధ్వర్యంలో దసరా పండుగ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆటో యూనియన్ లోని అన్ని ఆటోలపై పోస్టర్లు అతికిస్తూ, పండుగ వాతావరణంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మారబోయిన రవి యాదవ్ మాట్లాడుతూ – "ప్రభుత్వం ఆటో కార్మికులకు పథకాలు ఇస్తామని హామీ ఇచ్చి, వాటిని అమలు చేయకుండా మోసం చేస్తోంది. ఆటో కార్మికుల న్యాయమైన హక్కుల కోసం, వారి కష్ట సుఖాలను బీఆర్‌ఎస్ పార్టీ ముందుండి చూసుకుంటుంది. కార్మిక వర్గాల అభ్యున్నతి కోసం మా పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది" అని తెలిపారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు వేముల మారన్న, పరశురాముడు యాదవ్, సజుభాయ్, సైదులు, ఎల్ల స్వామి, శామప్ప, కే.ఎన్. రాములు, ప్రభాకర్ గౌడ్, గడ్డం శ్రీనివాస్, శంకర్, కొండకల్ శ్రీనివాస్, మల్లేష్ ముదిరాజ్, స్వామినాథ్, వెంకట్ రెడ్డి, నవీన్ గౌడ్, గంగాధర్ గౌడ్, మున్నా, సురేష్ యాదవ్, సతి గౌడ్, శ్రీకాంత్ యాదవ్, స్వామి ముదిరాజ్, వద్దే శ్రీనివాస్, సాయి నందన్ ముదిరాజ్, పవన్, శ్రీశైలం యాదవ్, ప్రేమ్, రాజు, వెంకట్ యాదవ్, బాలరాజ్, శ్రీకాంత్ రెడ్డి, ఇతర ఆటో యూనియన్ కార్మికులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.







# గోదావరి ఉధృతి..

- భద్రాచలం వద్ద "దోబూచులాట"
- హెచ్చుతగ్గులతో కొనసాగుతున్న ప్రవాహం
- అమలులో మొదటి ప్రమాద హెచ్చరిక

**భద్రాచలం సెప్టెంబర్ 28 ( డిడి9 వార్త)** భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం ఆదివారం పగలు, రాత్రి వేళల్లో స్వల్పంగా హెచ్చుతగ్గులు నమోదు చేస్తూ స్థానికులను, అధికారులను అప్రమత్తం చేస్తోంది. నీటిమట్టం ఒకసారి తగ్గుతున్నా, వెంటనే పెరుగుతూ 'దోబూచులాట' (దాగుడుమూతలు) ఆడుతోంది. ఆదివారం ఉదయం 6 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 42.10 అడుగులుగా నమోదైంది. అయితే, పగలు కొద్దిగా తగ్గుముఖం పట్టినట్లు కనిపించినా, రాత్రి అయ్యేసరికి మళ్లీ పెరుగుదల మొదలైంది. రాత్రి 10 గంటలకు నీటిమట్టం 43.70 అడుగులుకు చేరింది. ఆ తరువాత మరో గంటలో స్వల్పంగా పెరిగి రాత్రి 11 గంటలకు 43.80 అడుగులుగా రికార్డయింది. రాత్రి 12 గంటలకు కూడా అదే 43.80 అడుగులు వద్ద స్థిరంగా కొనసాగింది. గోదావరిలో నీటిమట్టం హెచ్చుతగ్గులు ఇలా కొనసాగుతుండటం వలన అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కొద్ది రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరిలోకి వరద ఉధృతి కొనసాగుతోంది. అయితే, ప్రస్తుతం నీటిమట్టం మొదటి ప్రమాద హెచ్చరిక (43 అడుగులు) కంటే స్వల్పంగా పెరిగి స్థిరంగా ఉండటంతో, భద్రాచలం వద్ద ఎలాంటి ముప్పు లేదని, పరిస్థితి అదుపులోనే ఉందని అధికారులు తెలిపారు. అయినప్పటికీ, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు హెచ్చరించారు.










# యువతకు ఉన్నత విద్యా అవకాశాలు అందుతాయి

- **విద్యా రంగంలో కొత్త అధ్యాయం సమ్మక్క సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ.**
- **సమ్మక్క సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ విశ్వవిద్యాలయం గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన.**
- **రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క.**

**ములుగు ప్రతినిధి సెప్టెంబర్ 28 డి డి 9 వార్త**

యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉన్నత విద్యా అవకాశాలు అందుతాయని, విద్యా రంగంలో కొత్త అధ్యాయం సమ్మక్క సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ సృష్టిస్తుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం లో జాతీయ రహదారి ప్రక్కనే ఉన్న సాయిబాబా టెంపుల్ రోడ్ వద్ద సమ్మక్క సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ విశ్వవిద్యాలయం కోసం 24 కోట్ల నిధులతో 8.4 కిలోమీటర్ల సమ్మేళనం గోడ నిర్మాణ పనులను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, మహబూబాబాద్, ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, జి నాగేష్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.ఎల్. శ్రీనివాస్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సమ్మక్కసారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుతో ములుగు జిల్లాకు ప్రత్యేక గౌరవ లభిస్తుందని, గిరిజన విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి ఇది బలమైన వేదిక అవుతుందని తెలిపారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ గిరిజన సంక్షేమం పట్ల కట్టుబడి ఉందని యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు, మౌలిక వసతులను సమకూర్చుతామని పేర్కొన్నారు. యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉన్నత విద్యా అవకాశాలు అందుతాయని, విద్యా రంగంలో కొత్త అధ్యాయం సమ్మక్క సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ సృష్టిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల కోసం ఆధునిక లైబ్రరీలు, ల్యాబరేటరీలు, హాస్టల్స్, తరగతి గదులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. స్థానిక విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. యూనివర్సిటీ ఏర్పాటు వల్ల విద్యా రంగం, జిల్లా అభివృద్ధికి సహకారం ఏర్పడుతుందని విద్యార్థులు, యువత, స్థానికులు అందరూ ఈ యూనివర్సిటీ ద్వారా అద్భుత ఫలితాలను రాణిస్తారన్నారు. ప్రజా ప్రభుత్వం గిరిజన సంక్షేమం, విద్యా అవకాశాలను ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని, యూనివర్సిటీ ఏర్పాటు ములుగు జిల్లాకు గౌరవాన్ని కలిగించడమే కాక, విద్యా రంగంలో కొత్త మైలురాయిని సృష్టిస్తుందన్నారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు కాబోతున్న సమ్మక్కసారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీలో 80 శాతం స్థానిక విద్యార్థులకు ప్రవేశ అవకాశాలు కల్పించడం జరుగుతుందని యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా ప్రాంతీయ ప్రతిభను వెలికి తీయడానికి ముఖ్యమైన వేదికగా మారుతుందని తెలిపారు. స్థానిక విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని గిరిజన యూనివర్సిటీ అన్ని అవకాశాలు అందుబాటులో వస్తాయని అన్నారు. అన్ని హంగులతో ఆధునిక లైబ్రరీలు, ల్యాబరేటరీలు, హాస్టల్స్, తరగతి గదులు ఏర్పాటుచేసి విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. సమ్మక్కసారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ ద్వారా, యువత సుస్థిరమైన భవిష్యత్తుకు పునాది వేసినట్లు అవుతుందని సమాజానికి, జిల్లా అభివృద్ధికి, మరియు గిరిజన సంక్షేమానికి అభివృద్ధిలో మార్గదర్శిగా నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు జి నాగేష్ మాట్లాడుతూ 24 కోట్ల రూపాయలతో ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలోని గిరిజనుల విద్యాభివృద్ధి కోసం వారి సంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచానికి తెలియజేసేలా, ఆర్థిక అభివృద్ధిలో కూడా యూనివర్సిటీ ముఖ్య పాత్ర పోషిస్తుందని అన్నారు. త్వరలోనే క్యాంపస్ నిర్మాణం విద్యార్థులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని , కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో యూనివర్సిటీ నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. తెలంగాణ ప్రాంతానికి సెంట్రల్ గిరిజన యూనివర్సిటీని మంజూరు చేసినందుకు దేశ ప్రధాని, స్థానిక కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి లకు ధన్యవాదాలు తెలియజేశారు. యూనివర్సిటీ వేగవంతంగా ఏర్పాటు చేసే విషయంలో స్థానిక పార్లమెంట్ సభ్యులు కోరిక బలరాం నాయక్ తో కలిసి ముందుకు వెళ్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ లో రాబోయే ఐదు సంవత్సరాలలో 3000 నుంచి 5000 మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించనున్నారని అన్నారు. టాస్క్ సెంటర్ ద్వారా కూడా విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి పెంచే విధంగా చూస్తున్నామని పేర్కొన్నారు. సెంట్రల్ గిరిజన యూనివర్సిటీలో ప్రస్తుతానికి 42 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, కేంద్ర ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని ఇతర రాష్ట్రాల గిరిజన విద్యార్థులు కూడా ఇక్కడ యూనివర్సిటీలో ప్రవేశాలు పొందడం జరిగిందని తెలిపారు. శ్రీ సమ్మక్క సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ కి కేర్ టేకర్ గా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కు అదనపు బాధ్యతలు అందించడం జరిగిందని తద్వారా యూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియలో పనులు త్వరితగతిన పూర్తయ్యే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, మాజీ పార్లమెంట్ సభ్యులు సీతారామ్ నాయక్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన సీసీ రోడ్డు ప్రారంభించిన మంత్రి వర్యులు సీతక్క

**ములుగు ప్రతినిధి సెప్టెంబర్ 28 డి డి 9 వార్త**

ములుగు పట్టణ అభివృద్ధి పనుల్లో భాగంగా 4 కోట్ల రూపాయలతో సెంటర్ లైటింగ్ తో ఇటీవలే సీసీ రోడ్డు నిర్మించగా ఈ రోజు రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు నియోజకవర్గంలో ప్రతి గ్రామ గ్రామాన అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని ములుగు పట్టణంలో ప్రతి రోడ్డు అభివృద్ధి జరగబోతుందని ఇటీవలే ములుగు ప్రభుత్వ ఆసుపత్రి నుండి తోపు కుంట చెరువు వరకు 4 కోట్ల రూపాయలతో సెంటర్ లైటింగ్ తో సీసీ రోడ్డు నిర్మించడం జరిగిందని చెప్పారు ములుగు పట్టణ మహిళలు బతుకమ్మ పండుగ జరుపుకునే తోపు కుంట చెరువు వరకు ఎలాగైనా రోడ్డు నిర్మించి మహిళలు బతుకమ్మ కానుకగా ఇవ్వాలనే తొందరగా రోడ్డు నిర్మించడం జరిగిందని చెప్పారు రాబోయే రోజుల్లో ప్రతి మండలంలో అన్ని గ్రామాల్లో ప్రతి రోడ్లు నిర్మిస్తామని చెప్పారు ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి ,జిల్లా నాయకులు, పట్టణ కాంగ్రెస్ నాయకులు ,మహిళ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు





# చలో భద్రాచలం ధర్మ యుద్ధ సభకు భారీగా తరలి వెళ్లిన ఆదివా సిలు...

**సెప్టెంబర్ 28 డిడి 9 వార్త వెంకటాపురం.(నూగురు)**




ములుగు జిల్లా వెంకటాపురం, వాజేడు మండలాల నుండి ఆదివారం భద్రాచలం ధర్మ యుద్ధ బహిరంగ సభకు వందలాదిగ ఆది వాసీలు భారీగా తరలి వెళ్లారు. ఆదివాసి సంఘాలు, ఉద్యోగ సంఘాలు గ్రామాల వారీగా వాహనాలను సమకూర్చుకొని భద్రాచలం తరలి వెళ్లారు ముందుగా వెంకటాపురం మండల కేంద్రంలోని కొమరం భీమ్ విగ్రహం వద్ద సమావేశమై.. అనంతరం వాహన శ్రేణులన్నీ కలిసి .. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి ,హలో ఆదివాసి చలో భద్రాచలం అంటూ నినాదాలు గుప్పిస్తూ పెద్ద సంఖ్యలో సభకు బయలుదేరారు..



## ఆడపిల్లను పుట్టనిద్దాం... ఎదగనిద్దాం

- **ఐద్వా, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు.**

**భద్రాచలం, సెప్టెంబర్ 29 (DD 9 వార్త ):**

"ఆడపిల్లను పుట్టనిద్దాం, చదివిద్దాం, ఎదగనిద్దాం" అన్న బలమైన నినాదంతో భద్రాచలం పట్టణంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) సంయుక్త ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద, వాడవాడలా ఉత్సాహభరిత వాతావరణంలో ఈ సంబురాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. రాజుపేట, అశోక్‌నగర్, కొత్త కాలనీ, జగదీష్ కాలనీ, రామాలయ ప్రాంతాల్లో జరిగిన బతుకమ్మ ఉత్సవాలకు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డి. సీతాలక్ష్మి, డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఆది సతీష్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బతుకమ్మ ప్రకృతి పండుగ అని, ఆడబిడ్డలు తీరొక్క పూలతో దీనిని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. ఆడపిల్లల ఆవశ్యకతను చాటి చెప్పిన బతుకమ్మ: ఆనాడు ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అణిచివేతలను ఎదిరిస్తూ బతుకమ్మను పేర్చి, ఆడిపాడి ఆడపిల్లల ఆవశ్యకతను చాటి చెప్పిన విషయాన్ని వారు గుర్తు చేశారు. కాలం, సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, ప్రకృతి పండగ అయిన బతుకమ్మను రాజకీయాలకు అతీతంగా వాడవాడనా జరుపుకోవడం అభినందనీయమని కొనియాడారు.

**రాష్ట్రవ్యాప్తంగా నినాదం:**

ఆడపిల్లలపై పెరుగుతున్న వివక్షతను, అఘాయిత్యాలను నిర్మూలించేందుకు ఐద్వా, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇదే నినాదంతో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. బతుకమ్మ ఉత్సవ వేదికల్లో ఆడపిల్లలకు ఉన్న హక్కులు, చట్టాల గురించి ప్రజలకు, ముఖ్యంగా యువతులకు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. పట్టణంలోని మొత్తం 20 వార్డు కమిటీల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు నాగలక్ష్మి, సుబ్బలక్ష్మి, రాధా, జీవనజ్యోతి పాల్గొన్నారు



## ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాబోయే వేళ

**చర్ల, సెప్టెంబర్ 28( డిడి 9 వార్త)**

చర్ల మండల కేంద్రంలోని రైస్ పేట, శైలజ విహార్ లో ఈరోజు దేవాదాయ శాఖ స్టాండింగ్ కౌన్సిలర్, హైకోర్టు ప్రముఖ న్యాయవాది సీ.వి సతీష్ స్థానిక ప్రముఖుల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం ఏజెన్సీలోని చర్ల మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరుకై గత 15 ఏళ్లుగా వారు చేసిన ప్రయత్నానికి తొలి అడుగు పడిందని, ఎన్నో ఒడిదుడుకుల మధ్య డిగ్రీ కళాశాల మంజూరుకు ఉన్నత విద్యాధికారుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయన్నారు. చర్ల పరిసర ప్రాంతాలలోని అన్ని గ్రామాల వారికి, అన్ని వర్గాల వారికి ఉన్నత విద్యనభ్యసించే అవకాశం తప్పక త్వరలోనే సాధ్యమవుతుందన్నారు. పేద, మధ్య తరగతి వారు వ్యయ ప్రయాసలకు గురవాల్సిన పరిస్థితిని నుండి వారికి ఆర్థికంగా ఎంతో సహాయపడుతుందని అభిప్రాయపడ్డారు . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో మారుమూల చర్ల మండలానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు అవుతుందన్న పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, వెంకట్రావు, మురళీ, లాలయ్య, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.





### దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో

## కాంగ్రెస్ నేతల ప్రత్యేక పూజలు

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 28,(డిడి9 వార్త):**

కూకట్పల్లి నియోజకవర్గం మూసాపేట్ లోని చిత్తారమ్మ దేవాలయం వద్ద శ్రీ మహావీర్ భక్త మండలి ఆధ్వర్యంలో, ముసాపేట్ ప్రగతినగర్ కాంగ్రెస్ యువజన విభాగం నాయకుడు జిట్టా సునీల్ కుమార్ యాదవ్, ఖైతలాపూర్‌లో ఏఎంసి వైస్ చైర్మన్ ప్రకాష్ ఆధ్వర్యంలో ఏర్పాటైన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా TPCC ఉపాధ్యక్షులు, కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు (GVR), తూము వేణు, కర్కా పెంటయ్య పాల్గొన్నారు. నవరాత్రి సందర్భంగా జరుగుతున్న అమ్మవారి అలంకరణలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నాయకులు అభినందించారు.









## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహా అన్నదానం..

**సెప్టెంబర్ 28 . డిడి 9 వార్త వెంకటాపురం (నూగురు)**

వెంకటాపురంలోని మండల కేంద్రంలో మెయిన్ రోడ్ లో గల అమ్మవారి మండపంలో ఈరోజు దసరా శరన్నవరాత్రుల పురస్కరించుకొని ఏడవ రోజు పూజలు నిర్వహించారు. ఈరోజు అమ్మవారు మహా చండి దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈరోజు మండపంలో అర్చకులు శ్రీ కొండూరు శ్రీనివాస శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులుఅధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి చీరలు గాజులు సమర్పించారు పూజానంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాల స్వీకరించి అమ్మవారి సేవలో తరించారు. అమ్మవారి కరుణ కటాక్షాలు ఎల్లవేళలా తమపై ఉండేలా చూడాలని ఆకాశి అన్నపూర్ణాదేవిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. పూజానంతరం స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వేల్పురి సాంబశివ గారి జ్ఞాపకార్థం మహా అన్నదానం నిర్వహించడం జరిగింది..



DD9 వార్త
తెలుగు దినపత్రిక
DD9 Vartha
సోమవారం
29-09-2025

# డీఎస్పీ గా నియమితులైన ధైనంపెల్లి ప్రవీణ్ అభినందనలు

**ములుగు ప్రతినిధి సెప్టెంబర్ 28 డి డి 9 3**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ దృఢ సంకల్పంతో పనిచేస్తున్నారు.

ఈసందర్భంగా మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు గారు మాట్లాడుతూ... ధైనంపల్లి ప్రవీణ్ కుమార్ గారు చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి కష్టాలను అనుభవిస్తూ వారి నానమ్మ గారి సహకారంతో ఉన్నత చదువులు అభ్యసించి, కష్టాలను సైతం లెక్కచేయకుండా లక్ష్యాన్ని సాధించాలని దృఢ సంకల్పంతో ఏటూరునాగారం మండలం నుండి డిఎస్పీగా నియమితులు కావడం తెలంగాణ రాష్ట్ర యావత్ యువతకు ఆదర్శమని అన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి నియామకాలు చేయడమే సంకల్పంగా పనిచేస్తుందని అన్నారు. టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక్కో అభ్యర్థిపై మూడు కోట్ల రూపాయలు వసూలు చేశారని తప్పుడు ఆరోపణలు చేసి విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేయాలని చూశారు.కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు విద్యార్థుల భవిష్యత్తును మార్చాలని ఆరోపణలు లెక్క చేయకుండా దృఢంగా నిలబడ్డారు కాబట్టి నేటి పేద విద్యార్థులకు ఇలా ఉద్యోగాలు సాధించారని అని అన్నారు. ఏది ఏమైనా అప్పటికి ధైనంపెల్లి ప్రవీణ్ గారు చదువు తోనే జీవితం వెలుగులో మారుతుందని



నిరూపించారని అదేవిధంగా గర్వకారణమని అన్నారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వసంత శ్రీనివాస్,మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్ ఖాన్, జిల్లా యూత్ కార్యదర్శి గౌస్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నరసింహారావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గద్దల నవీన్,టౌన్ అధ్యక్షుడు బండారి లక్కీ,ST సెల్ మండల అధ్యక్షుడు చేల వినయ్,SC సెల్ అధ్యక్షుడు కర్నె సత్యం మాజీ వార్డు సభ్యులు పాగా నాగరాజు,పడిదల హనుమంత్,నెగరికంటి ముతేష్, కర్ల తరుణ్, మండల యూత్ నాయకులు పాల్గొన్నారు.



# మహా చండీ దేవి రూపంలో అమ్మవారు

**చర్ల, సెప్టెంబర్ 28 (డిడి 9 వార్త)**

చర్ల లోని శాలి బజార్ మండపంలో ఈరోజు దసరా శరన్నవరాత్రుల ను పురస్కరించుకొని ఏడవ రోజు పూజలు నిర్వహించారు. ఈరోజు సప్తమి కావున అమ్మవారు మహా చండీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈరోజు అర్చకులు విజయ్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి చీరలు, గాజులు సమర్పించారు. పూజానంతరం అమ్మవారి తీర్థ, ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి సేవలో తరించారు. అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లవేళలా తమపై ఉండేలా చూడాలని ఆ చండీ మాతాను భక్తి, శ్రద్ధలతో ప్రార్థించారు. శాలి బజార్ కమిటీ వారు ఈ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.




# స్వచ్ఛ భారత్‌లో బారాజాల కర్మాగారం భాగస్వామ్యం

- **అశ్వాపురం మెయిన్ రోడ్డుకు మరమ్మతులు**

**అశ్వాపురం, సెప్టెంబర్ 28 (డిడి 9 వార్త)**

స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా అశ్వాపురం మండల కేంద్రంలో గల బారాజాల కర్మాగారం ఉద్యోగులు శుక్రవారం విశేష కృషి చేశారు. మండలంలోని మెయిన్ రోడ్డు వెంబడి ఉన్న ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న గుంతలను మట్టితో పూడ్చి రోడ్డును సుగమం చేశారు.కర్మాగారం ఉద్యోగులు, సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్, గంటా శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటివ్ అండ్ పర్సనల్ ఆఫీసర్ కేశవరావు, పని శేఖర్, రాథోడ్, అలాగే అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఇతర ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు. కర్మాగారం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు.

# చెరువులో మొసలి కలకలం!

**ఏటూర్ నాగారం సెప్టెంబర్ 28 డి డి 9 వార్త**

ములుగు జిల్లా ఏటూర్ నాగారం డిగ్రీ కళాశాల ఎదుట గల రాళ్ళ కుంట చెరువులో మొసలి కలకలం రేపింది. చెరువులో పూల కోసం వెళ్ళిన కొంత మంది స్థానికులు మొసలి నీ చూసి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. కాగా సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా పూల కోసం చెరువులోకి ఎవరూ వెళ్ళవద్దునీ మొసలి దాడి చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. స్థానిక ప్రజలు ఈ విషయాన్నీ గమనించి అటవీ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.



# ఘనంగా మహా అన్నదాన కార్యక్రమం

**ఏటూర్ నాగారం సెప్టెంబర్ 28 డి డి 9 వార్త**

ఏటూర్ నాగారం మండల కేంద్రంలో నీ ముత్యాలమ్మ గుడి శ్రీ దేవి శరన్నరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఆదివారం మహా అన్న ప్రసాద దాత ఎర్రబెల్లి మనోజ్ . దీప్తి. ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. మహా అన్న ప్రసాద కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా గ్రామ పెద్దలు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గంపల శివ కుమార్. యూత్ కాంగ్రెస్ నాయకులు చోళం వికాస్. కర్ల తరుణ్. ఆలయ కమిటీ అధ్యక్షుడు సునారికని శ్రీనివాస్. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవార్లకు ప్రత్యేక పూజ కార్యక్రమంలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారూ ఈ కార్యక్రమంలో భక్తులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# సద్దుల బతుకమ్మ, దసరా నేపథ్యంలో... 44 మంది రౌడీషీటర్లు బైండోవర్

**వరంగల్, సెప్టెంబర్ 28 (డీడీ 9 వార్త):**

రానున్న సద్దుల బతుకమ్మ, దసరా పండుగ ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు వరంగల్ జిల్లా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా, మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని 44 మంది రౌడీషీటర్లను పిలిపించి, బైండోవర్ చేశారు. ముందస్తు నేర నివారణ ప్రక్రియలో భాగంగా, పండుగ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండాలని పోలీసులు రౌడీషీటర్లను హెచ్చరించారు. ఎటువంటి గొడవల్లోనూ జోక్యం చేసుకోకుండా, ప్రశాంతమైన వాతావరణంలో పండుగ జరిగేలా సత్ప్రవర్తన కలిగి ఉండాలని వారికి స్పష్టం చేశారు. అనంతరం, ఆ 44 మంది రౌడీషీటర్లను మంచి ప్రవర్తన నిమిత్తం ఖిలా వరంగల్ తహసిల్దార్ గారి ముందు బైండోవర్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ ఏఎస్పీ శుభం నగరాలే ఐపీఎస్ గారు, మిల్స్ కాలనీ సీఐ శ్రీ బొల్లం రమేష్, ఎస్ఐలు శ్రీకాంత్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబురాలు

**భద్రాచలం, సెప్టెంబర్ 28 (డీడీ 9 వార్త):**

భద్రాచలం నియోజకవర్గంలో బతుకమ్మ పండుగ సందడి మొదలైంది. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గారి ఆదేశాల మేరకు, స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల నాయకులు బతుకమ్మ సంబరాలను ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు భద్రాచలం మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి తెల్లం సీతమ్మ గారు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆమె పార్టీ మహిళలు, బూత్ కమిటీ సభ్యులు మరియు కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా బతుకమ్మ సంబరాలలో నృత్యం చేస్తూ, ఆ తర్వాత ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. పండుగ వాతావరణం కార్యాలయంలో నెలకొంది. ఈ కార్యక్రమంలో మండల నాయకులు,




పార్టీ కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. బతుకమ్మ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సందడిగా మారింది.

# గ్రూప్ 1 లో మెరిసిన ఆణిముత్యం



- దైనంపల్లి ప్రవీణ్ ను సన్మానించిన ప్రజలు
- మానస పల్లి దళిత బహుజన బిడ్డ ప్రవీణ్ మల్టీ జోన్ 01 డీఎస్పీ ఎంపిక
- గ్రామీణ ప్రాంతాల్లో యువత ప్రవీణ్ ను ఆదర్శంగా తీసుకోవాలి

**ములుగు ప్రతినిధి, (ఏటూర్ నాగారం) సెప్టెంబర్ 28 డి డి 9 వార్త**

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలో ములుగు జిల్లా ఏటూరునాగారం, మండలం ఆకులవారి గణపురం 12వార్డు మానసపల్లి గ్రామానికిచెందిన యువకుడు దళిత బహుజన బిడ్డ దైనంపల్లి ప్రవీణ్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి 105వ ర్యాంక్ సాధించారు. ఆయనకు మల్టిజోన్-1లో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పదవి కేటాయించబడింది. హైదరాబాద్ లో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా డీఎస్పీ గా నియామక పత్రం తీసుకొని నేరుగా తన స్వగ్రామం ఏటూర్ నాగారం రావడంతో ఆదివారం గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు ప్రజా సంఘాల నాయకులు ఆయా రాజకీయ పార్టీల నాయకులు ప్రవీణ్ కు ఘనంగా స్వాగతం పలికారు. ముందు గా గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు అంబేద్కర్ విగ్రహం కు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఊరేగింపుగా బయలుదేరి గ్రామ దేవత బొడ్రాయి వద్ద పూజాలు చేశారు. అనంతరం గాంధీ విగ్రహం కి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఊరేగింపు గా బి ఆర్ పంక్షన్ హాల్ లో సన్మాన కార్యక్రమం నిర్వహించి ఆయన ఎంతో కష్టపడి చదువు కోవడం తో మంచి స్థాయిలో ఉద్యోగం వచ్చింది అన్ని ఆయన పడిన కష్టం ను కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రస్తుతం యూపీఎస్సీ మెయిన్స్ రాసిన ప్రవీణ్ , ఆ ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రెండింటిలోనూ సత్తా చాటుతున్న ఆయన విజయంతో కుటుంబ సభ్యులు, మిత్రులు, జిల్లా ప్రజలు గర్వపడుతున్నారు. ప్రవీణ్ దైనంపల్లి యొక్క విజయానికి పెద్దఎత్తున అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సమాజానికి సేవ చేయాలన్న తపనతో ఆయన ఇంకా ఉన్నతస్థాయిలో ఎదగాలని ములుగు జిల్లా ప్రజలు స్థానిక ఏటూరు నాగారం ప్రజానీకం అందరూ ఆకాంక్షిస్తున్నారు. చిన్న వయసులో తండ్రి మరణించడం తో తల్లి గ్రామ పంచాయతీ ఏటూరు నాగారం లో పారిశుద్ధ కార్మికురాలుగా పనిచేస్తూ ప్రవీణ్ ఐదవ తరగతి వరకు మానసపల్లి ప్రాథమిక పాఠశాలలో .పదోతరగతి వరకు ఏటూరు నాగారం జిల్లా పరిషత్ పాఠశాలలో తల్లి ప్రోద్బలంతో విద్యను అభ్యసించాడు. ఉన్నత చదువులు చదువుకొని మంచి స్థాయిలో ఉండాలని తరచూ చదువు కోవడం తో మంచి స్థాయి ఉద్యోగాలు. సమాజంలో ఉన్నత స్థాయిలో మంచి గౌరవం లభిస్తాయని ప్రవీణ్ తల్లి తరచూ చెబుతూ ఉండేదని. తల్లి అనారోగ్యం తో మరణించడంతో ఏటూరు నాగారం లో నాయనమ్మ ల వద్ద ఉంటూ విద్యను అభ్యసించాడు.

తల్లి కోరిక మేరకు తల్లి.తండ్రి నీ కోల్పోయిన ప్రవీణ్ నాయనమ్మ లు గ్రామ పంచాయతీ. ఆర్టీసీ బస్టాండ్లో పారిశుద్ధ కార్మికులుగా పనిచేస్తూ ఉండేవారు .వచ్చిన కొద్దిపాటి జీతంతో ప్రవీణ్ ఉన్నత చదువులకు తమ వంతు సహాయ సహకారాలు అందించేవారు. ప్రవీణ్ కు తమ్ముడు చెల్లి ఉన్నారు. తమ్ముడు దైనంపల్లి ప్రకాష్. అన్న ప్రవీణ్ సహకారం తో నిజామాబాద్ యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించి. ప్రవీణ్ సూచనల మేరకు హైదరాబాద్ ప్రత్యేక కోచింగ్ తీసుకొని 3 ఉద్యోగాలు సాధించి ప్రస్తుతం గ్రూప్ 4 లో జూనియర్ అస్టెంట్ గా ఏటూర్ నాగారం జి సి సి లో విధులు నిర్వహిస్తున్నాడు. ఇంటర్ ములుగు జిల్లా జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో విద్యను అభ్యసించా డు. ఇంటర్ తర్వాత హైదరాబాద్ లోని ఉస్మానియా యూనివర్సిటీలో డిగ్రీ. పి.జీ.విద్యా అభ్యసిస్తూ ఎస్సీ స్టడీ సర్కిల్ హైదరాబాదులో సివిల్ సర్వీసెస్ కోచింగ్ తీసుకుంటూ. రెండుసార్లు ఇంటర్వ్యూ వరకు వెళ్లడం జరిగింది. అయినా కూడా పట్టు విడవని విక్రమార్కుడు వలె. సివిల్ సర్వీసెస్ పై ప్రత్యేక దృష్టి సారించి .ప్రిపరేషన్ కొనసాగిస్తున్నాడు. ప్రస్తుతం సివిల్ పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నాడు. సివిల్స్ సాధించడమే తన లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు. ఈ క్రమంలో గ్రూప్ వన్ నోటిఫికేషన్ వెలువడటంతో గ్రూప్ వన్ దరఖాస్తు చేసి పరీక్షల్లో ప్రిలిమ్స్ మెయిన్స్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో 105 వ ర్యాంకు సాధించి విజేతగా నిలిచాడు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం. ప్రకటించిన ఫలితాలలో జోనల్ వన్ కి డీఎస్పీగా కేటాయించడం జరిగింది. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో నుండి దళిత బహుజన బిడ్డ ప్రవీణ్ డీఎస్పీ గా ఎంపి కావడంతో ములుగు జిల్లా ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రవీణ్ కు అభినందనలు తెలుపుతున్నారు. గ్రామీణ ప్రాంత యువత ప్రవీణ్ ను ఆదర్శంగా తీసుకోవాలని విద్యపై దృష్టి సారించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిటమాట రఘు. గంపల శివకుమార్. వావిలాల ఎల్లయ్య. నరసింగరావు. గోపాల్. హనుమంత్. ముతేషు. సాంబశివరావు. నరేష్. ప్రకాష్. తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణలో కొత్త యూనివర్సిటీ.. పనులు ప్రారంభం

**ములుగు ప్రతినిధి సెప్టెంబర్ 28 డి డి 9 వార్త**



తెలంగాణలో కొత్త యూనివర్సిటీ.. పనులు ప్రారంభం ములుగు జిల్లా కేంద్రానికి సమీపంలోని గట్టమ్మ గుట్ట వద్ద ప్రతిష్టాత్మక సమ్మక్క సారలమ్మ కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంబంధించిన పనులకు మోక్షం లభించింది. రూ. 24 కోట్ల వ్యయంతో 8.4 కి.మీ పొడవైన ప్రహరీ గోడ నిర్మాణ పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ గిరిజన విశ్వవిద్యాలయం ద్వారా ఈ ప్రాంత యువతకు ఉన్నత విద్యావకాశాలు మెరుగుపడతాయని అన్నారు.

# సోమవారం 'గిరిజన దర్బార్'కి ఐటీడీఏ అధికారులు హాజరు కావాలి

- పీఓ బి. రాహుల్

**భద్రాచలం, సెప్టెంబర్ 28 (డిడి 9 వార్త)**



భద్రాచలం ఐటీడీఏ (ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ) పరిధిలోని గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం నేడు సోమవారం నిర్వహించే 'గిరిజన దర్బార్' కార్యక్రమానికి సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ప్రాజెక్టు అధికారి (పీఓ) బి. రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 29, సోమవారం నాడు ఐటీడీఏ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆయన పేర్కొన్నారు. గిరిజనులు తమ సమస్యలకు సంబంధించిన అంశాలను లిఖితపూర్వకంగా ఫిర్యాదు రూపంలో అందజేయాలని ఆయన కోరారు. గిరిజనులు సమర్పించిన సమస్యల పరిష్కారంపై వెంటనే దృష్టి సారించేందుకు గాను, అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు ఉదయం 10:30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో హాజరుకావాలని పీఓ బి. రాహుల్ ఆదేశించారు. గిరిజన దర్బార్‌కి హాజరయ్యే విషయంలో అధికారులు ఎటువంటి అలసత్వం వహించరాదని ఆయన హెచ్చరించారు.




# వృద్ధాశ్రమంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

- మధుమేహం, రక్తపోటు పరీక్షలు

**అశ్వాపురం, సెప్టెంబర్ 28 (డిడి 9 వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వాపురం మండలంలో గల హరిఫా అండ్ రోస్ని వృద్ధాశ్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ అశ్వాపురం స్టార్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వృద్ధులకు ఉచితంగా మధుమేహం (డయాబెటిస్), రక్తపోటు (బీపీ) పరీక్షలతో పాటు ఇతర సాధారణ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. మధుమేహం, అధిక రక్తపోటు ఉన్న వృద్ధులకు పలు ముఖ్యమైన ఆరోగ్య జాగ్రత్తలను వైద్యులు సూచించి, అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఆరోగ్య రక్షణకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని, వయసు పెరిగే కొద్దీ మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ అశ్వాపురం స్టార్స్ ప్రెసిడెంట్ నలగట్ల సత్య ప్రకాష్, డాక్టర్ బి.వి. సత్యనారాయణ, గుర్రం నాగేశ్వరరావు, అలాగే హరిఫా అండ్ రోస్ని వృద్ధాశ్రమ నిర్వాహకులు మరియు వృద్ధులు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ సేవలను వృద్ధాశ్రమ నిర్వాహకులు అభినందించారు.